
**కథ :**

# బెంగళూరు ఎక్స్‌ప్రెస్

- శారదా అశోకవర్ధన్



అది సంధ్యా సమయం.

తొలి సంజె కెంజాయతో నూతన వధువులా, నూనుగు సిగ్గులతో తడబడుతున్న అడుగులతో శోభనం గదిలోకి అడుగుపెట్టే కొత్త పెళ్లికూతురిలా వుంది. ఆకాశ రాజు కప్పుకున్న చలి రగ్గు ఇంకా తొలగలేదు. చిరుగాలుల సవ్వడి ఎదలో మధువులు కురిపించే వేణుగానంలా వుంది. కొత్త దంపతుల కోరికల్లా స్పీడుగా పరిగెడుతోంది బెంగళూరు ఎక్స్‌ప్రెస్. ఆ వెలుగు జిలుగుల్లో దీపాల మందిరాల్లా వున్నాయి కంపార్ట్‌మెంట్‌లు. 'కూపే'లో మాత్రం చిన్న నీలిబల్బు వెలుగుతోంది. ఆ నీలి బల్బు కాంతిలో కింది బెర్తు మీద హాయిగా నిద్రపో తున్న నవయవ్వన సుందరి దేవికారాణి. లేత గులాబీ రంగు నైటీ పైన అందంగా ఎంబ్రాయిడరీ చేసిన ఎర్ర గులాబీలు మధ్య దేవికారాణి సొగసు, పౌర్ణమి నాటి చంద్రుడిని చూసి కైపెక్కిన కలువబాల్లా వుంది.

పైన బెర్తు మీద పడుకున్న రవీంద్రకి మాత్రం మహా చిరాగ్గా వుంది. అనీజీగా వుంది. అలజడిగా వుంది. ఫాను గాలికి జుట్టు చెదిరి కళ్ల మీద పడి కళ్లకి సన్నని పరదా కట్టినట్టుగా అడ్డుగా వుంది. ఎడంచేతి వేళ్లతో మాటిమాటికీ క్రాపు సవరించుకుంటున్నాడు. ఆ సమయంలో తనకెంతో ఇష్టమైన దుబ్బు లాంటి క్రాపు, ఎందరో ఆడపిల్లలు సయితం మెచ్చుకునే ఆ క్రాపు మీద విపరీతమైన కోపం వస్తోంది. "హాయిగా బోడి గుండుంటే బాగుండేది" అనుకుంటూ బెర్త్ మీద ఊపిరాడనట్టు ఉక్కిరి బిక్కిరయిపోతూ అటూ ఇటూ దొర్లుతున్నాడు.చూపులన్నీ కింది బర్తు మీదే! నాగరికత కళ్లెం మనస్సుని వెనక్కి లాగుతూన్నా అతి వేగంగా పరుగెట్టే ఆలోచనల్ని కంట్రోల్ చెయ్యలేక పోతోంది. అలా రెప్ప వాల్చకుండా కిందికి చూస్తూనే వున్నాడు.

వొంకు వొంకుల జుట్టు, చక్రాల్లాంటి కళ్లు, మీగడ తరగల్లా మెరిసిపోతున్న మేను, కంటి నంటి పెట్టుకున్న జవానుల్లా నిటారుగా తీర్చిదిద్దినట్టున్న కనుబొమలు, వాటి మధ్యన దీపస్తంభంలా ఆమె తీర్చిదిద్దుకున్న తిలకం బొట్టూ నిద్రలో పసిపాపలా అమాయకత్వం ఉట్టిపడుతున్న ఆ ప్రశాంత వదనం ఎంత చూసినా తనివి తీరక పిచ్చెక్కుతోంది. మధ్య మధ్య ఆమె మీద ఏదో కోపం కూడా వస్తోంది. తనకేమీ పట్టనట్టు ప్రపంచ శాంతికి ప్రతినిధిలా హాయిగా ఆమె అలా నిద్రపోవడం చూస్తే, ఒళ్లు మండుతోంది రవీంద్రకి.

"తనకి రాని నిద్ర ఆమెకెలా వస్తోంది? తన వంతు నిద్రని కూడా నిద్రాదేవి ఆమెకే ఇచ్చేసిందేమో! ఆమెకసలు మనసూ, అనుభూతి, ఆలోచనా ఇవేవీ లేవా? ఇంత అందమైన మనిషికి అంత మొద్దు మనసునిస్తాడా దేముడు? హాయిగా ఇటువంటి వాతావరణంలో రేయంతా కబుర్లు చెప్పుకుంటూ మానస సరోవరంలో లాహిరి పాట పాడుకుంటూ బోటు షికారు కెళుతున్నట్టు, జగమంతా ఊయలగా బతుకంతా పండువగా గడపొచ్చుగా! ఈ నిద్రలేనితనం, ఈ కలవరం తనకేనా?" విసుక్కున్నాడు రవీంద్ర.

ఆమెకి నిద్రాభంగం కలిగించి లేపేస్తే? పైనుంచి పడిపోయినట్టుగా ఈ దిండుని ఆమె మీద పడేస్తే? ఆమె లేవగానే 'సారీ' చెప్పేసి కబుర్లలో పడిపోవచ్చు. వెంటనే తలకింద వున్న బూరుగు దూది పిల్లో తీశాడు ఆమె మీద పడెయ్యడానికి. సరిగ్గా మొహం మీద పడేలా గురివెయ్యాలని కిందికి చూశాడు. ఆమె చిరునవ్వు నవ్వుతోంది. కళ్లు మూసుకునే నవ్వుతోంది! తియ్యని కల కంటోందేమో! చిరు నవ్వుతో చిన్నగా విడిపోతూన్న పెదవులు విడలేక విడలేక విడిపోతున్న జంటలా కనిపించాయి. ఆ సుందర దృశ్యాన్ని తిలకిస్తూ చేతిలోని దిండుని గుండెలకి ఆనించుకుని, పులకించిపోతూ ఆమెనే చూస్తూండిపోయాడు రవీంద్ర. మనస్సు దూది పింజల్లా తేలిపోతోంది.

స్నేహ బృందంతో కబుర్లు చెబుతూ లేటుగా స్టేషన్ కొచ్చిన రవీంద్ర రైలు కదలబోతూంటే ఎలాగో ఎక్కేశాడు. 'ఇ' బోగీ తలుపులు తెరిచి లోపలికి అడుగు ముందుకు పడక ఆగిపోయాడు. దివి నుంచి దిగివచ్చిన అప్సరస. అప్పుడప్పుడు సినిమాల్లో చూపించినట్టు స్వర్గంలోకం బోరు కొడితే భూలోకానికి వచ్చినట్టు అక్కడ లోయర్ బెర్త్ మీద కూర్చునుంది! అతని బాధనర్థం చేసుకుందేమో ఆమె.

"మీది 'ఇ' నంబరా? అయితే ఇదే రండి!" అంది. ఒక్కసారి రవీంద్ర తన టిక్కెట్టుకేసి, కంపార్ట్‌మెంట్ కేసి పరికించి చూశాడు. అది 'ఇ' బోగీయే అప్పర్ బెర్త్ తనది. మెల్లగా ముందుకెళ్లి సూట్‌కేస్ బెర్త్ మీద పెట్టాడు. ఒదిగి ఒదిగి లోవర్ బెర్త్‌కి అటువైపుగా బుద్ధిగా కూర్చున్నాడు. ఆమె విండో దగ్గర కూర్చుంది. చేతిలో ఏదో పుస్తకం వుంది. కాలేజీలోనూ బయటా ఎందరో ఆడపిల్లల్ని ఆటపట్టించినా, అలా బందీలా ఒకచోట ఒక ఆడపిల్లకి అందులోనూ అప్సరస లాంటి ఆడపిల్ల ముందు ముద్దాయిలా కూర్చోవడానికి ఇబ్బంది పడిపోతున్నాడు.

"మామూలుగా అయితే ఒక చిన్న విజిల్ వేస్తే ఉలిక్కపడిపోయేవారు. కొంచెం చొరవ తీసుకుని జోక్ చేస్తే కందిపోతూ కంట తడిపెట్టుకునేవారు. ఇలాంటప్పుడు మాత్రం పెద్ద ధీరుల్లైనట్టు, భలే చొరవ చూపిస్తారు." అనుకుంటూ అటూ ఇటూ చూస్తూ కూర్చున్నాడు రవీంద్ర.

"ఆడపిల్ల బయట కనిపిస్తే ఆకతాయిగా అల్లరి చేసే ఈ మగాళ్లు, ఇలా ఒంటరిగా వుంటే బేలగా అయిపోతారెందుకు?" అనుకుంటూ క్రీగంట అతనికేసి చూసింది ఆమె దుబ్బులాంటి క్రాపుని కుదుర్చి అమర్చి దువ్వుకున్న తీరు, ట్రిమ్‌గా పెంచుకున్న మీసం, బలిష్ఠమైనదిగా ఆరోగ్యవంతమైనదిగా కనిపించే శరీరం. "అందగాడే" అనుకుంది.

జేబులోని రుమాలు తీసి మొహం తుడుచుకుంటూ ఆమెకేసి చూశాడు. పలికే పాలరాతి బొమ్మలా వుంది. 'ఎవరివో...నీ...వెవరివో...ఎవరివో...' పాట జ్ఞాపకానికొచ్చింది. కాస్త మాట్లాడించొచ్చుగా! ఎందుకంతబెట్టు? అనుకుంటూ ఇంతమంచి బెర్త్‌నిచ్చి నందుకు రైల్వే వారికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ మళ్లీ ఆమెకేసి చూశాడు. మీరు "బెంగళూరుకేనా వెళ్లేది?" ఇక పట్టలేక అడిగేశాడు రవీంద్ర.

"అమ్మయ్య! ఇప్పటికి బెక్కొదిలింది. దారిలో కొచ్చాడు" అనుకుంటూ "అవును. మీరెక్కడికి?" అడిగింది దేవిక.

"నేను కూడా బెంగళూరుకే. అక్కడ మెడికల్ కాన్ఫరెన్సుకి మా ఆసుపత్రి తరఫున వెళుతున్నాను."

"మీరు డాక్టరా?"

"అవును ఎమ్.డి.ఇన్ కార్డియాలజీ! మీది బెంగళూరా?"

"మాది బెంగళూరు కాదు. హైదరాబాద్. మా బాబాయిగారూ వాళ్లూ బెంగళూరులో వుంటారు. వాళ్లమ్మాయి పెళ్ళి. అమ్మానాన్నా ముందే వెళ్లిపోయారు. నేను మా 'కాన్వొకేషన్' కోసం వుండిపోయాను."

"అంటే...మీరు పి.జి. గ్రాడ్యుయేటా?"

"అవును. ఎమ్.ఏ. ఇంగ్లీషు లిటరేచర్!"

"మీ పేరు?"

"దేవికా రాణి"

"నాపేరు రవీంద్ర"

ఆమె చిన్నగా నవ్వింది. ఆ నవ్వు పుచ్చపువ్వులు విచ్చుకున్నట్టుగా వుంది. ఎన్నో కబుర్లు! కార్డియాలజీ, హార్ట్ డిజీజెస్, లిటరేచర్‌లో షెల్లీ, కీట్స్, కృష్ణశాస్త్రి, రాయప్రోలు, స్టూడెంట్లూ, కాలేజీ గొడవలు, నేటి విద్యావిధానాలూ, రాజకీయ పరిస్థితి, ఒకటేమిటి? ఎన్నో విషయాలూ, విశేషాలూ, వారి సంభాషణల్లో చోటు చేసుకున్నాయి.

మాట్లాడుతూన్నంత సేపూ ఆమె సౌందర్యం అతడికి మత్తెక్కిస్తోంది. అతడి ఠీవీ, దర్పం ఆమెని ఊహల్లో ముంచెత్తి ముగ్ధురాలిని చేస్తోంది. ఇద్దరిదీ ఒకటే భావన! ఒకరికి ఒకరు కావాలి! అదేదో జన్మజన్మల బంధంలా వుంది. వీడలేని ఆత్మీయతలా వుంది. కానీ ఇద్దరూ పైకి చెప్పుకోలేకపోతున్నారు. మెల్లగా ఏ అర్థ రాత్రికో నిద్రలో జారుకుంది దేవిక. అసలు నిద్ర పట్టక దొర్లుతున్నాడు రవీంద్ర!

నులి వెచ్చని సూర్యకిరణాల తాకిడికి తియ్యని కలల్లోంచి మేలుకుని కళ్లు తెరిచింది దేవిక! ఆక్షణం కోసం ఎదురుచూస్తున్న రవీంద్ర బెర్తుదిగి కిందికొచ్చి, "గుడ్‌మార్నింగ్" అన్నాడు. ఆమె కళ్లు ఇంకా మగతగానే వున్నాయి. బరువుగా వున్న కనురెప్పల్ని మెల్లగా తెరుస్తూ "గుడ్ మార్నింగ్" అన్నది. ఆమెను అలా చూస్తూ వుంటే అతనికి అన్నమాచార్య కీర్తన జ్ఞాపకం వచ్చింది. "పలుకుతే నెల తల్లి పవళించెనె.." అన్న అలివేలు మంగ పవళించిన తీరుని వర్ణిస్తాడు అన్నమాచార్య. ఎంత చక్కటి ఊహా చిత్రం అనుకుంటూ దేవిక కేసి చూశాడు. ఆమె చప్పున లేచి కూర్చుంది. సిగ్గు పడుతూ ముంగురులు సవరించుకుంటూ, లేచి బెడ్ సర్దేసింది. అతడు కాఫీ కప్పునందించాడు. మళ్లీ ఇరువురూ కబుర్లలో పడి పోయారు. ఈ సారి కబుర్లు ప్రేమ వివాహాల గురించి, వైవాహిక సమస్యల గురించీ, సంప్రదాయాల గురించీ జరిగింది. వారికి తెలీకుండానే వారు ఒకరికొకరు వారి వివాహ నిర్ణయాన్ని కూడా చెప్పేసుకున్నారు. "మీరూ మీ అభిప్రాయాలూ నాకెంతో నచ్చాయి. నేను కోరుకున్న స్త్రీ మూర్తులా మీరే" అన్నాడు ఆనందంగా రవీంద్ర.

"మీరూ, మీ సభ్యతా, మీ సంస్కారం నన్నాకట్టుకున్నాయి. నా ఊహాసుందరుడు మీరే" అంది సిగ్గు పడుతూ దేవిక. ఆ సిగ్గు బుగ్గలో చేరగా బుగ్గలు రెండూ ఎఱ్ఱ గులాబీల్లా అయ్యాయి.

"మనం ఈ ప్రయాణానికీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌కీ ఋణపడి వున్నాం కదూ?" అంది దేవిక ఊహల్లో తేలిపోతూ.

"అవును. మన జీవితం ఎప్పుడూ ఈ ప్రయాణం లాగే తియ్యగా సాగాలి" అన్నాడు రవీంద్ర.

✿ ✿ ✿ ✿ ✿

నక్షత్ర మండలంలా వెలిగిపోతోంది వెంకట్రామా రెడ్డి హాలు. ఎందరో పురప్రముఖుల మధ్య, అందరి ఆశీస్సులతో అత్యంత వైభవోపేతంగా జరిగింది దేవికా, రవీంద్రల పెళ్లి. ఆరోజు వీరి పెళ్లిలో సంభాషణల్లో రైలు కుదిర్చిన పెళ్లి, 'పెళ్లి చేసిన బెంగుళూర్ ఎక్స్‌ప్రెస్' వంటి జోకులతో, ఛలోక్తులతో ఎంతో సంబరంగా గడిచిపోయింది. చూస్తూండగానే మూడు వసంతాలు గడిచిపోయాయి. ఫలితం 'సుఫల' వీరి ప్రేమ గుర్తుగా ఈ ప్రపంచంలోకి అడుగిడింది. ఇరువురుకీ సుఫల పంచప్రాణాలునూ. వారి ప్రేమాంకురం, ప్రేమ పూచిన తొలి పుష్పం అనుకుంటూ గతాన్ని నెమరేసుకుని జ్ఞాపకాల అలల్లో తేలిపోతూంటారు దేవిక, రవీంద్రలు.

సుఫల పుట్టిన వేళా విశేషం, రవీంద్ర ప్రాక్టీసు పెట్టుకున్నాడు. అటు ఆసుపత్రి ఇటు క్లినిక్, క్షణం తీరికుండడం లేదు. సుఫల పాకడం నుంచి తప్పటడుగుల దాకావచ్చింది. ఒక్క క్షణం ఊరికే వుండదు. ఒక్క వస్తువు కింద కనిపించనివ్వదు. రేడియో లాగుతుంది. టి.వి. తిప్పేస్తుంది. ఫోను తీసి 'లో..లో..' అంటూ ఆడుతుంది. ఆమెని పట్టడం దేవిక తరం కావడంలేదు. పగలంతా పనితోటి, పాపతోటి అలిసిపోయి, ఇంటికొచ్చిన రవీంద్ర మీద చూపిస్తోంది చిరాకు. ఆసుపత్రిలో, క్లినిక్‌లో రకరకాల రోగులతో విసిగిపోయి ఇంటికొచ్చిన రవీంద్రకి దేవిక పలికే ఆహ్వానం చిరాకు కలిగిస్తోంది. "నన్నేం చెయ్యమంటావ్? కాస్త ఓపిక పట్టు. సుఫల కాస్త పెరిగాక నువ్వు ఉద్యోగం చేద్దువుగాని" అనేవాడు లాలనగా.

"అవున్లే! ఈలోగా నువ్వు ఇంకా పేరు మోసిన డాక్టరువవుతావు. నేను అలవాటు పడిపోయి వంట మనిషిలా, పని మనిషిలా పడుంటాను. నేనేమీ సగటు ఆడదాన్ని కాదు. ఎమ్.ఏ. ఫస్టుక్లాసు, గోల్డ్ మెడలిస్టుని. రాత్రి కూడా నువ్వే ఏదో పగలంతా అలిసిపోయినట్టు పడుకుంటావ్? నాకు అలుపులేదా? నాకు విశ్రాంతి అవసరం కాదా?"

"దేవికా! ఎందుకింత రాద్ధాంతం చేస్తావు? అవన్నీ నేనన్నానా? ఇద్దరం వృత్తి ధర్మమంటూ ఇల్లు విడిచి వెళ్లిపోతే సుఫల ఏమౌతుంది? పాప భవిష్యత్తుని తీర్చి దిద్ద వలసినది మనం కాదా? అందులో తండ్రిపాత్రకన్నా తల్లి పాత్రే ఎక్కువవుంటుంది. కాస్త ఓపిక పట్టు. నువ్వూ ఉద్యోగం చేద్దువుగాని. అయినా ఇప్పుడు నువ్వు తప్పనిసరిగా ఉద్యోగం చెయ్యాలనే అవసరం ఏదీ లేదుగా! ఇల్లు చక్కగా పెట్టుకోవడం, పాపని బాగా చూసుకోవడం కూడా ఉద్యోగమే! ఇది వెలకట్టలేని ఉద్యోగం."

"తల్లి పాత్రా ఇడ్లీ పాత్రా ఏదీ లేదు. ఏవో లేని పోని పొగడ్తలు చేసి, నీ అంతటిది లేదని ఆకాశానికెత్తేసి ఇంట్లో అంట్లు తోమడానికీ చాకిరీ చెయ్యడానికీ వాడుకుంటారు. రాత్రిళ్లు నువ్వు రంభవీ, రాగిణివీ అనగానే అతని అవసరాలు తీర్చే మరమనిషిలా చేరువవుతుంది స్త్రీ! ఛీ! ఈ మగాళ్లంతా ఇంతే?" ఆవేశంతో మాట్లాడుతున్న దేవిక వైపు ఆశ్చర్యంగా చూశాడు రవీంద్ర. వాతావరణం సీరియస్ కాకూడదని, "పోనీ నేను ఉద్యోగం మానేసి నువ్వు చేసే పన్లన్నీ చేస్తాను. నువ్వెళ్లి ఉద్యోగం చేసిరా. నాకే అభ్యంతరమూ లేదు. నువ్వు ఊఁ..అంటే రేపట్నుంచి పన్లు మార్చుకుందాం. కొత్త పన్లలోకి చేరిపోదాం." అన్నాడు నవ్వుతూ రవీంద్ర.


అతడలా మాట్లాడుతూంటే దేవికకి అరికాలి మంట నెత్తికెక్కుతోంది.

"మీకంత వేళాకోళంగానూ, ఎగతాళిగానూ వుందా?" విసురుగా అంది.

"మరేం చెయ్యమంటావు చెప్పు. డబ్బిచ్చినా పనివాళ్లెవ్వరూ దొరకనప్పుడు మనలో మనం మన పన్లు చేసుకోవడం తప్పా? అయినా మనం చేసుకోకపోతే ఎవరు చేసి పెడతారు?"

"నీకు, నీ వాళ్లెవ్వరూ ఈ దేశంలోనే లేరాయె. వాళ్లకి మనుషుల కంటే డాలర్లే ముఖ్యం."

"దేవికా! వాళ్ల గొడవ మనకెందుకు? ఎవరి జీవితాలు వాళ్లవి. ఎవరి బాధలూ, బాధ్యతలూ వాళ్లేవహించాలి! ఇవేమైనా జాయింటు ఫామిలీ రోజులా? నిజంగా అలా జాయింటు ఫామిలీయే వుంటే, నువ్వు అత్తరికం బాధలేదంటూ, ఇతరుల గొడవలేవీ లేవంటూ, మా అమ్మానాన్నలు, తమ్ముళ్లూ మరదళ్లతో వుండగలవా? ఈ రోజుల్లో అందరూ స్వతంత్రంగా వుండాలనే కోరుకుంటున్నారు. కోడళ్ల చేత చేయించుకోవాలీ, కొడుకు



## వేసవిలో కొన్ని జాగ్రత్తలు

వచ్చేది వేసవికాలం! ఒళ్లంతా పేలడం, చమట కాయలు రావడం సహజం. అంతేకాదు చెమట పట్టడం. చిరాకు కలగడం సహజం. మరి వాటికి చిట్కా వైద్యాలు లేవా? లేకేం ఉన్నాయి.

❀ బియ్యం కడిగిన నీటితో చమటకాయలున్న భాగాన్ని కడగాలి. ఇలా చేస్తే నాలుగైదు రోజులలోనే అవి మాయమవుతాయి.

❀ జీలకర్రను బాగా పొడిచేసి కొబ్బరి పాలలో కలిపి శరీరానికి పట్టించండి. ఆ తరువాత కాసేపు ఆగి గోరువెచ్చని నీటితో స్నానం చేయండి! ఇలా నాలుగైదు రోజులు చేస్తే చమటకాయలు మాయమవుతాయి.

❀ దానిమ్మ చెట్టు వేరు, చింత గింజలు, శంఖం వీటిని పొడిచేసి ఆ చూర్ణాన్ని శరీరానికి పట్టించి స్నానం చేస్తే చమట వాసన రాదు.

కొందరికి అరచేతులు, అరికాళ్లు చెమట పడుతుంటాయి. అలాంటివారు :

✿ పదిహేను రోజుల కొకసారి వంకాయ ముక్కలు తరిగి నానబెట్టిన నీటిలో కాళ్లూ చేతులు కడుక్కోవాలి.

✿ ఉసిరికాయను బాగా చితక్కొట్టి ఆ రసాన్ని తీసి అరిచేతులకు పూయాలి. కానీ చేతులు కడుక్కోరాదు. అప్పుడు అరిచేతులు చెమట పట్టవు.

లచేత చేయించుకోవాలి అని తల్లి దండ్రులు కూడా కోరుకోవడం లేదు. దానివల్ల కొంత వరకు అత్తాకోడళ్ల సమస్యలూ, ఉమ్మడి కుంటుంబాల సమస్యలూ తీరిపోయినా, కొత్త రకం సమస్యలు తలెత్తాయి. ఎవరికి వారు గిరిగీసుకుని, భార్యా భర్తలు, పిల్లలు అంతవరకే బాధ్యతల్నీ అభిమానాల్నీ పంచుతున్నారు, పెంచు కుంటున్నారు. మిగతా అయిన వాళ్లందరూ కూడా పరాయివాళ్లలాగానే ఫీలవుతున్నారు. మనవలు దగ్గరున్నా ముద్దూ ముచ్చట్లూ తీరడంలేదని పెద్దవాళ్లూ, ఇంట్లో పిల్లల్ని చూసుకోవడానికి సలహా సంప్రదింపులకు పెద్ద దిక్కులేరని వారి పిల్లలూ వాపోతున్నారు. ఏది ఏమైనా ఈనాడు, నాటి అభిమానాలూ, అనురాగాలూ, అంత రించిపోయి, అవసరాలే ఎక్కువ కనిపిస్తున్నాయి" సుదీర్ఘమైన ఉపన్యాసం ఇచ్చాడు రవీంద్ర.

దేవికకి పిచ్చి కోపం వచ్చింది. అతడు జనరల్‌గా చెప్తున్న వాస్తవాలనర్థంచేసుకోకపోగా, ఏదో కాకమ్మ కబుర్లు చెప్పి సమస్యని నెట్టి పారేస్తున్నాడనిపించింది. తన క్లాస్‌మేట్‌లు రజిత, భార్గవి, మంజూష, తనకన్న తక్కువ శ్రేణిలో పాసయి, ఇప్పుడు ఉద్యోగాలు చేసి వెలిగిపోతూంటే తను చదువూ సంధ్యాలేని దానిలా ఇల్లూ, పాపా అంటూ కూర్చోవడం చిన్నతనంగా వుంది అంది అసలు భావాన్ని బయటపెడుతూ.

"దేవికా! పెళ్ళయ్యాక నాకో హోదా నీకోహోదా అని ఎందుకనుకోవాలి. మనలో ఎవరికిహోదా కలిగినా అది పూర్తిగా మన కుటుంబానిది కాదా? ఆలోచించు". అన్నాడు ఆప్యాయంగా.

"నా ఇండివిజ్యువాలిటీ, నా ఆత్మ గౌరవం నాది" మొండిగా అంది దేవిక.

"ఏదైనా మహిళా మండలి మీటింగ్‌కి వెళ్లొచ్చావా ఏమిటి?" వ్యంగ్యంగా అన్నాడు.

"ఏం? మహిళా మండలంటే అంత చులకనా నీకు?"

"ఛీ! ఛీ! అదేంకాదు. నీ ధోరణి ఇంత వాడిగా వుంటే, ఇప్పుడీ వేడి వేడి ఆలోచనలు నీలో పొగలో స్తున్నాయని అన్నానంతే!" నవ్వుతూ అన్నాడు రవీంద్ర.

"రవీంద్రా! ఇదంతా చాలుగానీ, సూటిగా నేచెప్పేది విను. మనం వెళ్లి మా వాళ్లింట్లో వుందాం. సుఫలని మా వాళ్లు చూసుకుంటారు. నేనూ ఉద్యోగం చెయ్యొచ్చు." రవీంద్ర షాక్ తిన్నాడు.

"అమ్మమ్మయినా బామ్మయినా, అమ్మానాన్న ఆ తరవాతే కదా?" అనుకుంటూ, మొహంలో ఆ భావం తెలీనీకుండా, "అంటే నన్ను ఇల్లరికం రమ్మంటున్నావా?" అడిగాడు.

"అలా పేరు పెట్టుకోవడం దేనికి?" ఉక్రోషంగా అతడి ముఖకవళికలు చదువుతూ అంది దేవిక.

"మరి?"

"వెళ్లి వుండడం అనుకుంటే పోలా?" అంది.

"కరెక్ట్! ఏదైనా అనుకోవడంలోనే వుంది. నేను ఉద్యోగం చెయ్యాలి. నీలాగే అనుకునే భావనలో 'నా', 'నీ' అనే ధోరణి కనిపిస్తుంది. అలాకాక, నేను చేసే ఉద్యోగంహోదా నీది కూడా. నువ్వు చేస్తున్న ఇంటిపని వంటపనీ అంతా నాది కూడా, అని మనం ఇద్దరం అనుకోవడంలో వుంది." అన్నాడు 'అనుకోవడం' అనే పదాన్ని నొక్కి చెబుతూ.

"రవీంద్రా! నువ్వు చాలా తెలివైన వాడివి. నీ మాటలలోనే నా కొర్కెలని నొక్కి పెట్టెయ్యగల సమర్థుడవు. మా వాళ్లింట్లో వుండడం నీ కిష్టం లేదు. నేను నీలా ఉద్యోగం చేసి పేరు ప్రతిష్ఠలు సంపాదించడం నీ కిష్టం లేదు." అంది కోపంగా.

"కరెక్ట్! నాకు కావలసింది నాఇల్లూ, నా భార్యా, నా పిల్లలు! అది కానిది మా అమ్మా నాన్నలదైనా పరాయిగానే భావిస్తాను నేను."

"అదేనా నీ నిర్ణయం?"

"అదే" ఖచ్చితంగా చెప్పాడు.

"అయితే, నా నిర్ణయం కూడా విను. ఓ గోల్డ్ మెడలిస్ట్ పోస్ట్‌గ్రాడ్యుయేట్‌ని! మామూలు ఆడదానిలా పడుండలేను. నాకూ తెలివి తేటలున్నాయి. సమాజంలో

## మనమూ - మన దేహమూ

- మన శరీరంలోని బలమైన ఎముక - ఫిమర్ అనే తొడ ఎముక.
- అప్పుడే పుట్టిన శిశువు బరువు సాధారణంగా 2.5 నుంచి 3 కి.గ్రా॥ వుంటుంది.
- రక్తప్రసరణ నిలిచిన తరువాత మెదడు ప్రాణంతో వుండే సమయం - 3 నిమిషాలు.
- ఒక సాధారణ మనిషి శరీరంలో 5 లీటర్ల రక్తం వుంటుంది.
- మన జీవితంలో ఏఏ సంవత్సరాల మధ్య శరీరం త్వరగా పెరుగుతుందో తెలుసా? - 10 నుంచి 16 సంవత్సరాలు.
- ఒక నిమిషానికి గుండె 60 నుంచి 100 సార్లు వరకూ కొట్టుకుంటుంది.
- ఒక వ్యక్తికి రోజుకి సాధారణంగా 2 నుంచి 2 1/2 లీటర్ల నీరు కావలసి వస్తుంది.

నాకంటూ ఒక స్థానాన్నేర్పరచుకోగలను. నా ఆత్మ గౌరవం పెరిగేదీ, నా వ్యక్తిత్వం నిలిచేదీ, నాకంటూ ఒక స్థానం వున్నప్పుడే. నీ హోదా నాదిగా, నీ సంపాదన నాదిగా భావించే, భావనలో బతకలేను. మనిద్దరం కలవని రైలు పట్టాల్లా ఆలోచిస్తున్నాం. ఇలా కలిసి బతికే బదులు విడిపోవడం నయం" విసురుగా అక్కడి నుంచి వెళ్లిపోయింది.

"దేవికా! మనం బాధ్యతగల తల్లిదండ్రులం. సుఫల మన బిడ్డ. ఆమె భవిష్యత్తు కోసం బాటలు వెయ్యాలి."

"నేను ఉద్యోగం చేస్తూ ఆమె భవిష్యత్తుకి బాటలు వెయ్యలేనా?

"దేవికా మొండిగా వాదించకు."

"నువ్వే మూర్ఖంగా మాట్లాడుతున్నావ్! నువ్వొస్తే నాతో మావాళ్లింటికిరా! లేకపోతే నేను వెళ్లిపోతాను. సుఫలకి నేనొక్క దాన్నే బంగారు బాట వెయ్యగలను."

సూట్‌కేస్ సర్దుకుంది.

"దేవికా! ఎందుకు నన్నిలా దూరం చేసుకుంటు న్నావు?" కోపంగా అరిచాడు.

"నీతో వుంటే నువ్వే గొప్ప డాక్టరువన్న అహంభావం వల్ల. నేను ఉద్యోగం చెయ్యడానికి తగిన అవకాశాలు ఇవ్వని నీ సంకుచిత స్వభావం వల్ల."

"నేను నీకు అవకాశాలివ్వనన్నానా? నాది సంకుచిత స్వభావమా? షటప్" అరిచాడు.

"యూ..షటప్!.."

దేవిక చెంపచెళ్లుమంది.

ఉగ్రకాళిలా సూట్‌కేసునీ, సుఫలనీ తీసుకుని ఆటో ఎక్కేసింది దేవిక.

ఇరువురి గుండెల్లో మంటలు! మనసుల్లో రోషం పౌరుషం సెగలు, పట్టుదలకు సంకేతాలు. ఆ రాత్రి వాళ్లపాలిటి కాళరాత్రి! వెన్నెల మండిపోతున్నట్టుంది చంద్రుడు పిండి ముద్దలా వున్నాడు. నిద్ర పట్టక బంజారా హిల్స్ ఇంద్రలోక్ అపార్ట్‌మెంట్స్‌లో రవీంద్ర, పద్మారావు నగర్‌లోని, రవిచంద్ర బంగళాలో దేవిక! గుక్కపెట్టి ఏడుస్తున్న సుఫలని సముదాయిస్తున్నారు లాయర్ రవిచంద్ర, సరళా దేవిలు.

"ఏమండీ! ఎన్నో కేసులకి ఇట్టే పరిష్కారాన్నిచ్చి కలిపిన మీరు, మన దేవికా రవీంద్రల విషయంలో ఇలా మౌనంగా వుండి పోయారేమండీ? ఏదో ఒకటి చెయ్యండి. ప్లీజ్" ప్రాధేయపడింది సరళాదేవి.

"పిచ్చిదానా! ఈ సమస్య చాలా అబ్‌స్ట్రాక్ట్ కేవలం మూర్ఖంగా అర్థంలేనివి సృష్టించుకుని ఆత్మ గౌరవం గాడిద గుడ్డూ అని అఘోరిస్తున్నారు కానీ అసలు ఆత్మగౌరవం అంటే ఏమిటి? ఉద్యోగం చేస్తేనే ఆడదానికి ఆత్మగౌరవమా? భార్యాభర్త లిరువురూ సంసారానికి రెండు స్తంభాల్లాంటివారు. అతడు బయటికెళ్లి డబ్బు సంపాదించి తీసుకొస్తే, ఆమె ఆ డబ్బుని సద్వినియోగ పరుస్తూ, ఇంటి అడ్మినిస్ట్రేషన్ నడుపుతుంది. రెండూ బాధ్యతలే ఇందులో హెచ్చు తగ్గుల ప్రసక్తేముంది. అత గాడి సంపాదన చాలనప్పుడో, వేరే బాధ్యతలు అంటే పిల్లా జెల్లా లేనప్పుడో ఆమె కూడా ఉద్యోగం చెయ్యాలి. అంతేకానీ...ఇలా పిల్లని మన మీద వదిలేసి, పొద్దుటి నుంచి సాయంత్రం వరకూ ఉద్యోగం చేసి ఏం సాధి స్తోంది? అతడి ప్రవర్తన బాగాలేకపోతే, నేనే విడాకులిచ్చి తీసుకొచ్చి ఉద్యోగం చేయించేవాడిని. కానీ ఇది అలాంటి కేసు కాదు. అహంకారం, అజ్ఞానం, అవివేకంతో ఆలోచన మూసుకుపోయి పట్టాలు తప్పిన ఎక్స్‌ప్రెస్ లాంటిది. వారే వారి తప్పులు సరిచేసుకోవాలి. తిరిగి ఈ రైలుని రైలు పట్టాల మీదికెక్కించుకోవాలి. అంతే గానీ ఏ కోర్టూ వీరికి ఏమీ చెప్పలేదు. దీనికి కాలమే పరిష్కారం చెప్పాలి." అన్నారు లాయర్ రవిచంద్ర.

సరళాదేవి మూగదైపోయింది. శూన్యంలోకి చూస్తుండిపోయింది, భుజాన పడుకున్న సుఫలని జోకొడుతూ.

ఆ దృశ్యం చూడలేనట్టు చందమామ మబ్బుల దుప్పటి కప్పేసుకున్నాడు. ❑